మాజీ ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం



గూడూరు రూరల్: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా చెన్నై నుండి నవజీవన్ ఎక్స్ ప్రెస్ లో తిరుపతి జిల్లా గూడూరుకు సోమవారం విచ్చేశారు. ఆయనకు గూడూరు రైల్వే స్టేషన్ లో ఆర్డీవో కిరణ్ కుమార్, ఎస్ పి సూర్యనారాయణ రెడ్డి, రైల్వే ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు, బిజెపి వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ ఆర్ నాయుడు, గూడూరు పట్టణ బిజెపి అధ్యక్షులు ఆరికట్ల బాలకష్ణ నాయుడు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం వెంకయ్యనాయుడు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టుకు వాహనంలో బయల్దేరి వెల్లారు. ఈ కార్యక్రమంలో గూడూరు రూరల్ సిఐ దశరథ రామారావు, రెండో పట్టణ సిఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'నిఫా'తోనే.. నమ్మకమా..?

- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఉద్యోగుల మండిపాటు
- ఇన్‌స్పెక్షన్ల పేరుతో హెచ్ఎంలకు భారం

ప్రజాశక్తి- తిరుపతి

పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇన్‌చార్జి లకు ఒకవైపు ఇప్పటికే ఉన్న యాప్‌లు భారంగా మారాయని ఆందోళన చెందుతుంటే అవి చాలవన్నట్లు తాజాగా ఇన్‌స్పెక్షన్ ఫారం ఒకటి డిజైన్ చేసి దానిలో వివరాలు నమోదు చేయాలని ఒత్తిడి తెస్తుండటం గమనార్హం. దీంతో ప్రధానోపాధ్యాయులకు ఒక రోజులోని 8 గంటల పనిలో గంటన్నర సమయం యాప్‌లకే కేటాయించాల్సి వస్తోంది. సాంకేతికతతో ముడిపడిన అంశాలను అంతర్జాలంలో అనుసంధానించే బాధ్యతను హెచ్ఎంలకు ఇవ్వడంతో 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డ ' చందంగా తమ బతుకులు మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా వరకు పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండటంతో నెట్‌వర్క్ సరిగా లేక ఫోటోల అప్లోడ్ విషయంలో సమస్య తలెత్తుతోందని వాపోతున్నారు. అయితే ఇదేమీ పట్టని ఉన్నతాధికారులు మాత్రం ప్రధానోపాధ్యాయుల పనితీరు బాగోలేదంటూ నివేదికలు ఇస్తుండటం శోచనీయం.

ఐఎంఎంఎస్ యాప్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించడంపై ప్రధానోపాధ్యాయులు మండిపడుతున్నారు. ఆయా సమాచారం , ఫోటోలు అప్లోడ్ చేయడానికే తమ విలువైన సమయం పోతోందని, కనీసం పాఠాల ప్రణాళిక చూడటానికీ తీరిక ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు మరుగుదొడ్ల శుభ్రతకు సంబంధించి కేవలం ఫోటోలు మాత్రమే తీసి యాప్‌లో అప్లోడ్ చేసేవారు. ప్రస్తుతం వాటి శుభ్రతను తనిఖీ చేసిన ప్రధానోపాధ్యాయుడు, ఇంచార్జి ఎవరనేది వారి ముఖంతో సహా ఫోటో తీసి ఇన్‌స్పెక్షన్ ఫారంలో అడుగుతున్నారు. మరుగుదొడ్ల శుభ్రతకు వాడే రసాయనాలు, టూల్స్ ఉన్నాయా? లేదా? సింకులు బాగున్నాయా? బ్రెష్‌లు ఉన్నాయా? అయిపోయాయా? వాటిని వినియోగిస్తున్న ఆయా ఎవరు వంటి వివరాలు నమోదు చేసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించడంతో ప్రధానోపాధ్యాయులు గొల్లుమంటున్నారు. ఇన్ని వివరాలు అడిగితే ఇవన్నీ తాము ఫారంలో నింపి, ముఖంఫోటో తీసుకుని దాన్ని యాప్‌లో అప్లోడ్ చేయడానికి చాలా సమయం వెచ్చించాల్సి ఉంటుందని అంటున్నారు. ఇవన్నీ కూడా ఉదయం 10.30 గంటల్లోపు చేయాలి. ఆ తర్వాత మధ్యాహ్న భోజన పథకానికి తయారుచేసిన ఆహార పదార్థాలు విడివిడిగా ఒకటి, మొత్తం కలిపి మరో ఫోటో తీయాలి. 12 గంటలకు పిల్లలకు అన్నం వడ్డించి వారు తినే పరిసరాలు సైతం ఎలా ఉన్నాయో ఫోటోలు తీసి పెట్టాల్సి ఉటుందని ఏకకాలంలో ఇన్ని యాప్‌లు ప్రవేశపెట్టడమే ఒక తప్పిదం అనుకుంటే తాజాగా ఇన్‌స్పెక్షన్ ఫారం ఒకటి డిజైన్ చేసి పెట్టారని, దాన్ని నింపడానికే చాలా సమయం పడుతోందని ఉపాధ్యాయవర్గం చెబుతోంది. టీచర్, స్టూడెంట్ హాజరు, మరుగుదొడ్ల ఫోటోలు తీసి యాప్‌లో అప్లోడ్ చేస్తే చాలనుకుంటున్నారు. ఇవి చేస్తే ఆ రోజుకు తన విధినిర్వహణ సజావుగా పూర్తయినట్లుగా భావించే స్థితికి వచ్చేశారు.

బోధనకు అడ్డంకులు సృష్టించడమే

ముత్యాలరెడ్డి , యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ యాప్‌ల నిర్వహణ బోధనకు అడ్డంకులు సృష్టించడంగానే మేం పరిగణిస్తున్నాం. ప్రధానోపాధ్యాయులు పాఠశాల నిర్వహణతో పాటు, తరగతుల పర్యవేక్షణను చేపట్టాలి. పైగా విద్యార్థులకు పాఠాలనూ బోధించాలి. ఇలాంటి తరుణంలో గంటల తరబడి సమయాన్ని యాప్‌ల నిర్వహణకు కేటాయించడమంటే బోధనకు ఇబ్బందులు కలిగించడమే. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోవాలి. లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు.

అక్రమాలపై ప్రశ్నిస్తున్న సిపిఎం నాయకులు కందారపు మురళి

మా అభ్యంతరాలను పట్టించుకోండి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి అవకతవకలుగా జరిగిందని, తమ అభ్యంతరాలను పూర్తిగా పట్టించుకోలేదని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఏర్పాటుచేసిన రాజకీయ పార్టీల సమావేశంలో సిపిఎం నేత కందారపు మురళి అధికారులను నిలదీశారు. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తి అవకతవకలతో కూడి, అధికార పార్టీ కనుసన్నల్లో జరుగుతున్నాయని, ఏ అభ్యంతరాలనూ అధికారులు పట్టించుకోవడంలేదని నిలదీశారు. సోమవారం నాటి మధ్యాహ్నం మూడున్నర గంటలకు రాజకీయ పక్షాలు, ఎమ్మార్వోలతో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ తమ అభ్యంతరాలను పూర్తిగా పరిగణలోకి తీసుకోలేదని, దొంగ ఓటర్లను గుర్తించే ప్రక్రియ హేతుబద్ధంగా లేదని ఆరోపించారు. అధికార పార్టీ వత్తిడులకు తలొగ్గి ఎమ్మార్వో స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అక్రమార్కులకు అగ్ర పీఠం వేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెద్దల సభకు జరిగే ఎన్నికల్లో ఇంతటి దారుణమైన పరిస్థితులు నెలకొంటే ఇక సాధారణ ఎన్నికల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు? వాకాడు ఎన్‌బికెఆర్ కాలేజీ పరిధిలో అర్హులైన 180 మంది ఓటర్లు నమోదయి ఉంటే నెల్లూరు జిల్లాలో 26 మందిని తొలగించారని, తిరుపతి జిల్లాలో ఒక్కరిని కూడా తొలగించలేదని ఎత్తి చూపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి, విశ్వనాథ్, సిపిఎం నేతలు జి. బాలసుబ్రమణ్యం, మునిరాజ, తంజావూరు మురళి, కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రమీలమ్మ, నరసింహులు, బిజెపి నేత వరప్రసాద్, తెలుగుదేశం పార్టీ నేత మనోహరా చారి తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపండి : కలెక్టర్

ఎంఎల్‌సి, గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓటర్ల జాబితాపై డిసెంబర్ 30 న ప్రకటించిన వాటిలో రాజకీయపార్టీలు అభ్యంతరాలు తెలపవచ్చని , నమోదుకు కూడా అవకాశం వుందని కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లో ప్రకటించిన గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలతో ఇఆర్‌ఓ , ఎయిఆర్‌ఓ లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో రాజకీయ పార్టీలు సూచించిన అభ్యతరాలను జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసామని అన్నారు. అర్హతలేని గ్రాడ్యుయేట్ ఓటర్లను 3,297 మందిని గుర్తించి తొలగించామని అన్నారు. ఉపాధ్యాయ ఓటర్లగా నమోదు చేసుకున్న వారు జిల్లా విద్యాశాఖ అధికారి దవీకరణ చేసినవని, ఉపాధ్యాయ ఓటర్లను పరిశీలించాలనే నేడు రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు మరోమారు పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తామని అన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్లు వివరాలు నియోజకవర్గం వారిగా...

గూడూరు (ఎస్.సి.) : 13192
సూళ్ళూరు పేట (ఎస్.సి.): 12186
వేంకటగిరి (పార్ట్): 6613
చంద్రగిరి : 14405
తిరుపతి : 21383
శ్రీకాళహస్తి :11326
సత్యవేడు (ఎస్.సి.): 7801
నగరి (పార్ట్): 3763
మొత్తం : 90669 ఓటర్లు .

ఉపాధ్యాయ ఓటర్లు వివరాలు నియోజకవర్గం వారిగా

గూడూరు (ఎస్.సి.) : 1016
సూళ్ళూరు పేట (ఎస్.సి.) : 913
వేంకటగిరి (పార్ట్): 333
చంద్రగిరి : 908
తిరుపతి : 1825
శ్రీకాళహస్తి :610
సత్యవేడు (ఎస్.సి.):277
నగరి (పార్ట్): 371
మొత్తం : 6,253 ఓటర్లు

టిటిడి పీస్ రేట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమలలోని కల్యాణకట్టలో పనిచేస్తున్న పీసురేటు కార్మికులు 53 మందిని అకారణంగా తొలగించడం అన్యాయమని, తొలగించిన 53 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని టీటీడీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నేత టి .సుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తప్పుడు ఫిర్యాదు లేఖలతో టిటిడి విజిలెన్స్ సిబ్బంది కల్యాణ కట్టలో పనిచేస్తున్న పీసు రేటు బార్బర్లపై వేధింపులకు పాల్పడుతూ కక్షపూరితంగా 53 మందిని మూడు నెలలు పాటు విధుల నుండి తొలగిస్తున్నామని టీటీడీ ప్రకటించడం అన్యాయం అన్నారు. విజిలెన్స్ సిబ్బంది లేనిపోని దురుద్దేశాలు అంటగట్టి, తప్పులు చేశారని పీసురేట్ బార్బర్లపై నిరంతరం నిఘా పేరుతో వేధించడం మానుకోవాలన్నారు. విధులు నుండి తొలగించిన కార్మికుల కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని, పీస్ రేట్ కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు.

తిరుమల తిరుపతి అభివృద్ధిలో ఎన్టీఆర్‌ది ప్రత్యేక ముద్ర

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తెలుగు వారి ఖ్యాతిని దశ దిశల గుర్తించేలా చేసిన మహా నాయకుడు నందమూరి తారక రామారావు అని టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి అభివద్ధిలో ఎన్టీఆర్ తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ తాను ప్రజల మధ్యనే ప్రమాణ స్వీకారం చేస్తానని సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారన్నారు. 200 పైచిలుకు సీట్లను సాధించి నటులు రాజకీయపరంగా కూడా రాణించగలరని సంకేతాలను విమర్శలు చేస్తున్నవారికి పంపారన్నారు. తిరుమలలో ఉచిత తలనీలాలు, అన్నదానం, క్యూ కాంప్లెక్స్, తిరుపతిలో మహిళా యూనివర్సిటీ, మహిళా ప్రాంగణం, సిమ్స్ హాస్పిటల్ ఇలా అనేక నిర్ణయాలు తీసుకుని తిరుపతి చరిత్రలో చిరస్థాయి ముద్రను నందమూరి తారక రామారావు వేసుకున్నారన్నారు. అటువంటి నందమూరి తారక రామారావు పేరుతో ఏర్పాటు చేసిన హెల్త్ యూనివర్సిటీ పేరును నేడు అధికార పీఠం ఎక్కిన జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీగా పేరు మార్చడం అన్నగారి అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మనోహరాచారి, చెంచయ్య పాల్గొన్నారు.

బంగారు తాపడం పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం విమాన గోపురం కోసం సిద్ధం చేసిన బంగారు తాపడం పనులను సోమవారం ప్రారంభించారు. బంగారం తాపడం దాతలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి దంపతులు చేతులు మీదుగా ముందుగా సిద్ధంగా ఉన్న బంగారు తాపడం అచ్చులకు పూజలు చేశారు. అనంతరం విమాన గోపురం పై బంగారు తాపడం అమర్చే పనులకు పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతి మాట్లాడుతూ అమ్మణ్ణి ఆలయానికి బంగారు తాపడం తమ చేత చేయించడం తమ పూర్వ జన్మ సుకతంగా భావిస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 22 నుండి మూడు రోజుల పాటు ఆలయ కుంభాభిషేకం జరిపించాలని పండితులు నిర్ణయించినట్లు తెలిపారు.అలాగే ప్రత్యేక కుంకుమ పూజ నిర్వహిస్తామన్నారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్ర రెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఈవో ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు ముప్పాళ చంద్ర శేఖర్ రెడ్డి, పద్మజ, బండి సునీత, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కళత్తూరు రామ మోహన్ రెడ్డి, కళత్తూరు శేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ కొనసాగించాలి: ఎస్ఎఫ్ఐ

పజాశక్తి - తిరుపతి టౌన్

దేశ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేస్తున్న మైనారిటీ పరిశోధక విద్యార్థులకి సంబంధించిన మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు తిరుపతి పట్టణం లోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ .మాధవ్ మాట్లాడుతూ పరిశోధనలు ప్రోత్సాహించాల్సిన కేంద్ర ప్రభుత్వమే బాధ్యతారాహిత్యంగా మైనారిటీ వర్గాలకు చెందిన ఫెలోషిప్ పథకాన్ని రద్దు చేయడం శోచనీయమన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల కు చెందిన రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్ సంఖ్యను గణనీయంగా తగ్గించడమే కాకుండా గత రెండు సంవత్సరాలుగా ఫెలోషిప్ నిధులు విడుదల జాప్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశోధక విద్యార్థులందరికీ పరిశోధక భతి ఎనిమిది వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నాయకులు మోహిత్, జిల్లా అధ్యక్షుడు భగత్ రవి, ఉపాధ్యక్షులు అక్బర్, సహాయ కార్యదర్శులు హరిత, తేజ నాయకులు శివ, పథ్వి, భాస్కర్, సునీల్, రంజిత్, మహేష్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

పనులవగానే ఫిర్యాదుదారులకు తెలపాలి : మేయర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమస్యలపై ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, తగు చర్యలు తీసుకొని పూర్తి చేసిన పనుల వివరాలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి సోమవారం వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారులకు, అదేవిధంగా జూమ్ మీటింగ్ ద్వారా సంబంధిత సచివాలయ సిబ్బందికి పరిశీలించమని మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్క సచివాలయంలో ప్రతి సోమవారం ఉదయం పది నుండి పన్నెండు గంటల వరకు అడ్మిన్ ఆధ్వర్యంలో సెక్రటరీలు అందరూ అందుబాటులో వుండాలని ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్ కు 11 ఫిర్యాదులు, స్పందన కార్యక్రమానికి వచ్చిన 14 ఫిర్యాదులను మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసారు. ఇస్కాన్ టెంపుల్ నుండి కపిలతీర్థం రోడ్డు వరకు హెూటల్స్ ఎగ్జాయిట్ ఫ్యాన్ల వల్ల కారం కళ్ళల్లో పడుతోందని, చంద్రశేఖర్ రెడ్డి కాలనీలో కల్వర్ట్ కుంగిపోయిందని, నారాయణపురంలో రోడ్లు పాడైపోయాయని, మునిసిపల్ హెల్త్ సెంటర్లో సరిగా చూడడం లేదని, హెూటల్ బ్లిస్ పక్కన పెద్ద కాలువ కుంగిపోయిందని తదితర ఫిర్యాదులు వచ్చాయన్నారు.ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, రెవెన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫిసర్ డాక్టర్ హరికష్ణ పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

'స్పందన' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాల వ్యవధి లోపల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి అన్నారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జేసి డి కే బాలాజీ తో కలిసి పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీ దారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం అర్జీలు 75 రాగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 49 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్షిస్తున్నారని, జిల్లా అధికారులు వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు గైకొని పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ల్యాంకో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : అఖిలపక్షం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కార్మికుల పట్ల పరిసర గ్రామాల ప్రజల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తూ, ఇబ్బందులు కలుగజేస్తున్న పూర్వ ల్యాంకో యాజమాన్యం (ఎలక్ట్రో కాస్టింగ్ లిమిటెడ్ యాజమాన్యం) పై కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నేతలు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ ను కలిసిన వివిధ రాజకీయ పక్షాల నేతలు ల్యాంకో యాజమాన్యం చిందేపల్లి గ్రామస్తుల పట్ల వ్యవహరిస్తున్న తీరును సవివరంగా వివరించారు. ఎన్నో తరాల నుంచి చిందేపల్లి గ్రామస్తులు వాడుకుంటున్న ప్రభుత్వ రోడ్డును ల్యాంకో యాజమాన్యం అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిందని, చిందేపల్లి గ్రామస్తులు వివిధ సంఘాల సహకారంతో నిర్మాణాలను కూల్చివేశారని అయినప్పటికీ లెక్కచేయకుండా యాజమాన్యం గ్రామస్తులను వేధిస్తూ ప్రభుత్వ రోడ్డును ఆక్రమించుకోవడమే కాకుండా ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నదని జిల్లా కలెక్టర్ కు వివరించారు. ప్రభుత్వ రోడ్డును ఎవరు ఆక్రమించినా క్షమించేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని తాను ఆర్డీవోను స్వయంగా పరిశీలనకు పంపుతానని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళికి జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ల్యాంకో యాజమాన్యం ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరును గమనిస్తున్నామని, తమకు ఫిర్యాదులు అందాయని జిల్లా కలెక్టర్ నేతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ శ్రీనివాసరావు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ అనుపమ అంజలిలతోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, విశ్వనాథ్, సిపిఎం జిల్లా నేత జి. బాలసుబ్రమణ్యం, మునిరాజ, కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రమీలమ్మ, నరసింహులు, తెలుగుదేశం పార్టీ నేత మనోహరాచారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగర వాసులకి చంద్రగిరి సమీపంలోని కొత్తపల్లి ప్రాంతంలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం సిపిఎం బందం పరిశీలించింది. ఇళ్లను పరిశీలించిన అనంతరం సిపిఎం నగర కార్యదర్శి టి సుబ్రమణ్యం మాట్లాడుతూ తిరుపతిలో ఇల్లు లేని పేదలకు దాదాపు 5వేల మందికి చంద్రగిరి మండలం ఎం కొత్తపల్లి సమీపంలో ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. నివాసానికి యోగ్యం కాని కొండ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడం వల్ల, విద్య, వైద్యము, ఉపాధి సౌకర్యాలు లేక కష్టాల కడలిలో బతకాల్సి వస్తుందన్నారు. మూడు సంవత్సరాల పైబడి కావస్తున్నా ఇంతవరకు ఒక ఇల్లు కూడా నిర్మించ లేదన్నారు. ప్రభుత్వం ఇస్తున్న లక్షా 80వేల రూపాయలు ఇంటి నిర్మాణానికి సరిపోదని తెలిపారు. మున్సిపల్ అధికారులే కాంట్రాక్టర్ల ద్వారా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, నిర్మిస్తున్న ఇల్లు పునాది దశలోనే ఉన్నాయని, ఆ ఇళ్ల పునాదులను నాణ్యత లేకుండా కడుతున్నారని, సిమెంట్ ఇటుకలు కూడా నాణ్యతగా లేవని, తూతూ మంత్రంగా కడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని పెంచకపోతే 10 సంవత్సరాలైనా ఇంటి నిర్మాణాలు పూర్తి కావని అన్నారు. కాబట్టి లబ్ధిదారులే సొంతంగా ఇంటి నిర్మాణాలు చేపట్టడానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన సిపిఎం నేతల బందంలో సిపిఎం నగర నాయకులు కె.వేణుగోపాల్, ఆర్ లక్ష్మి, పి బుజ్జి, ఎం నరేంద్ర, ఆర్. మల్లికార్జున్ రావు, వి మోహనరావు పాల్గొన్నారు

చీకటి పడితే బిక్కుబిక్కు...!

- బాత్రూమ్‌లు లేక బహిర్భూమికి పోవాల్సిందే
- హాస్టల్లో నిత్యం దోమలు స్వైరవిహారం

ప్రజాశక్తి - పిచ్చాటూరు

పేరుకే ప్రభుత్వ బాలికల వసతి కేంద్రం.. రాత్రీపగలు తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తుంటాయి. వర్షాకాలంలో పాఠశాల నుంచి హాస్టల్‌కు వెళ్లే రోడ్డు మార్గం మరీ అధ్వానంగా ఉంటుంది. దీపాల్లేని మార్గంలో బిక్కుబిక్కుమంటూ బాలికలు వెళ తుంటారు..సరిపడా బాత్రూమ్‌లు లేక బహిర్భూమికి ఒక్కోసారి బయటకు వెళ్లాల్సి వస్తోంది. ఇది పిచ్చాటూరు ప్రభుత్వ బాలికల హాస్టల్లో దుస్థితి. జడ్‌పి ఉన్నత పాఠశాలకు 300 మీటర్ల దూరం ఉంటుంది. హాస్టల్ నలువైపులా బీడుభూములు దర్శనమిస్తూ ఉంటాయి. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులే ఈ హాస్టల్లో బస చేస్తూ ఉంటారు.

దోమల బెడద ఎక్కువ : నందిని, టెన్త్‌క్లాస్

మాది పేదరిక కుటుంబం. హాస్టల్లోఉంటున్నాను. హాస్టల్ చుట్టూ నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. అపుడపుడు అనారోగ్యానికి గురవుతూ ఉంటాం. దోమల బెడద లేకుండా కిటికీలకు మెష్ పెట్టి, దోమతెరలు ఉంచడం ద్వారా కొంతవరకైనా మా ఆరోగ్యాన్ని కాపాడుకుంటాం.

విషపురుగులు వస్తూ ఉంటాయి : పునీత, టెన్త్‌క్లాస్

కరెంట్ పోయిందంటే అంతే సంగతులు. చుట్టుపక్కల బీడు భూములు ఉండటం వల్ల విష పురుగులు కూడా హాస్టల్లోకి వస్తుంటాయి. కరెంట్ ఉన్నపుడైతే పర్వాలేదు. కరెంట్ పోయిందంటే మాత్రం భయమేస్తుంది. చిమ్మచీకట్లో కాలం గడపాల్సిందే. టెన్త్ క్లాస్ చదివేవాళ్లం ఐదుగురం ఉన్నాం.

సరిపడా మరుగుదొడ్లు లేవు : మీనా, టెన్త్‌క్లాస్

ప్రభుత్వ హాస్టల్లో మౌలిక వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కొన్ని మరుగుదొడ్లు లేకపోవడంతో హాస్టల్ బయటకు వెళుతున్నాం. చీకట్లో బయటకు వెళ్లే సమయంలో భయమేస్తుంది. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిధులు ఖర్చు చేస్తున్నారు. వసతి కేంద్రాలపైనా దృష్టి సారించాలని కోరుతున్నాం.

రోడ్డు మాత్రమే బాగోలేదు : గీత, వార్డెన్, పిచ్చాటూరు

నేను పుత్తూరు హాస్టల్ నుంచి మూడు నెలలుగా పిచ్చాటూరు ప్రభుత్వ బాలికల హాస్టల్‌కు డిప్యుటేషన్‌పై వస్తున్నాను. ఈ హాస్టల్లో మౌలిక వసతులు అన్నీ బాగానే ఉన్నాయి. మరుగుదొడ్లు కొన్ని మరమ్మతుకు గురయ్యాయి. వాటిని త్వరలోనే మరమ్మత్తు చేయిస్తాం. అయితే పాఠశాల నుంచి వచ్చే రోడ్డు మార్గం అధ్వానంగా ఉంది. సిమెంట్ రోడ్డు వేసి, విద్యుత్ లైట్లు వేస్తే బాగుంటుంది.

గర్భిణులకు భోజనాల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరులోని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూలి కిషోర్ రెడ్డి దాతత్వంతో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని గర్భిణులకు సోమవారం పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా భోజనాలు, గుడ్డు, అరటిపండు, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కిషోర్, జనవిజ్ఞాన వేదిక సమాజానికి ఉపయోగపడే అనేక మంచి కార్యక్రమాలు చేస్తున్నారని.. 8 సంవత్సరాలుగా భోజనాలు పంపిణీ సభ్యులందరినీ అభినందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారావు, జె.వి.వి.అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, కిషోర్‌రెడ్డి, చెంచునారాయణ, పురుషోత్తమరావు, రామమోహన్, కటకం శ్రీను, విజయ్‌బాబు, వెంకట్, ప్రభాకర్, జగదీష్, ఇబ్రహీం, ఆనంద్, విజయ్, చిరంజీవి, మల్లికార్జున, శర్మ తదితరులు పాల్గొన్నారు.

జీతాలివ్వాలని సీఐటీయూ ధర్నా

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు మండలంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న 26 నెలలను జీతాలు ఇవ్వాలని సిఐటియు డివిజన్ సెక్రెటరీ ఎం రమేష్ సత్యవేడు ఎంపీడీవో ఆఫీస్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వేతనానికి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు నెలనెలా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులకు గువుతున్నారన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి అరుణాచలం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని.. పెండింగ్‌లో లేకుండా జీతాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు మునస్వామి, చంద్రబాబు, ఏలుమలై, కుమార్, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవో 1ను వెంటనే ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-సత్యవేడు: కార్మికుల హక్కులను కాలరాసే జీవోనంబర్ ఒకటిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిఐటియూ డివిజన్ కార్యదర్శి ఎం రమేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి డి అరుణాచలం సంయుక్తంగా డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ విగ్రహం ఎదుట కార్మికులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజా పోరాటాలను అనచడం కోసం జీవో నెంబర్ ఒకటి తీసుకొచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఓజిలి నాయకులు

ప్రజాశక్తి - ఓజిలి : తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని ఓజిలి మండలం ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి , జడ్పీటీసీ సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. సూళ్ళూరుపేట నియోజకవర్గ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆదేశాలు మేరకు ఓజిలి మండలంలో ఎఫ్ డీ ఆర్ పనులకు సంబంధించి మరికొన్ని అదనపు పనులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రఘురాంరాజు , ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కలిసిన నాయకులు

తిరుపతి టౌన్ : నెల్లూరు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదం సాహెబ్ ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ అభ్యుదయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ మర్యాదపూర్వకంగా కలసి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అభ్యుదయ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు తమ రెక్కల కష్టంతో సంస్థ అభివద్ధికి తోడ్పడుతున్నట్లు తెలిపారు. తరువాత అధ్యక్షులు చంద్రగిరి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఆర్టీసీ ఉద్యోగీ ఎల్లప్పుడూ చిరునవ్వుతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. అలాగే ప్రధాన కార్యదర్శి జక్కా సాయిబాబు మాట్లాడుతూ అభ్యుదయ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆర్టీసీ కార్మికులకు అధికారులకు మధ్య వారధిలాంటిదని చెప్పారు.

నేడు క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి, తిరుమల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెటర్నరీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రాజ్ తెలిపారు. సోమవారం తిరుపతి

ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా అసోసియేషన్ గా ఉన్నామని, వత్తిలో ఆటవిడుపుగా ఈ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నామన్నారు. ప్రవేశానికి ఒక్కో జట్టుకు 3 వేల రూపాయలుగా నిర్ణయించామన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టోర్నమెంట్ కు మొత్తం 6 జట్లు పాల్గొంటాయన్నారు. మొదటి ప్రైజ్ 10 వేలు, రెండవ ప్రైజ్ 5 వేల రూపాయలను అందజేస్తామన్నారు. పాల్గొనే ఫోటోగ్రాఫర్స్ కు ఈ-శ్రమ్ కార్డులను ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాలాజీ, కమిటీ సభ్యులు సునీల్, ఆనంద్, గిరిధర్, సురేష్, రహ్మతుల్లా పాల్గొన్నారు.

పాదయాత్ర ఫలితమే మ్యానిఫెస్టో

ప్రజాశక్తి - పుంగనూరు: పాదయాత్ర ఫలితమే వైసిపి ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందిందని, ప్రజల కష్టాల మేరకు హామీలు ఇచ్చి అవి అమలు చేసిన ఘనత సిఎం వైఎస్ జగన్ దేనని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పుంగనూరు నియోజకవర్గం సదుం మండలంలో పల్లెబాట కార్యక్రమం చేపట్టిన మంత్రి సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర పూర్తి చేసి నాలుగు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో, సదుం బస్ స్టాండ్ లో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 341 రోజుల్లో 3648 కిలో మీటర్లు పాదయాత్ర చేసి రాష్ట్ర ప్రజల ఇబ్బందులను సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గుర్తించారని

పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు చేసిన మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు సదుం మండలం లోని తిమ్మనాయునిపల్లి, గొంగివారిపల్లి, అమ్మగారిపల్లి, సదుం, రెడ్డివారిపల్లి, చింతపర్తివారిపల్లి గ్రామం పంచాయతీల పరిధిలోని 33 పల్లెలు పర్యటించారు. ఇప్పటికే పుంగనూరు, చౌడేపల్లి, సోమల మండలాల్లో పల్లెబాట కార్యక్రమం పూర్తి చేసి ప్రజా సమస్యలను పరిష్కరించారు. కలకటవారిపల్లిలో సచివాలయం, రెడ్డివారిపల్లిలో ఆర్బికే భవనాలు ప్రారంభించారు. అదేవిధంగా దిగువకురపల్లి, అమ్మగారిపల్లి, బందార్లవారిపల్లి, రెడ్డివారిపల్లి, పిడిగోవులవారిపల్లి, చింతపర్తివారిపల్లి లో అంగన్వాడి భవనాలను ప్రారంభించారు.

తడలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి'..!

ప్రజాశక్తి-తడ: తడ మండలం కారూరు పంచాయతీలో సోమవారం 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ పార్లమెంటు సభ్యులు, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తక్షణమే సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, రాష్ట్ర కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ సభ్యులు బొమ్మన శ్రీధర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి పూడి సెల్వం, ప్రధాన కార్యదర్శి నీలకంఠం, పార్లమెంట్ తెలుగు బీసీ అధికార ప్రతినిధి జీవ , పలని, తెలుగు యువత అధ్యక్షుడు టీకే రవి, బొర్లింగాలపాడు రమేష్, పర్వత్ రెడ్డి కోటిరెడ్డి, రామ్మూర్తి, రోశెట్టి శివాజీ, టీడీపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే మండలాభివృద్ధి

ప్రజాశక్తి-ఓజిలి: సమిష్టి కృషితోనే మండలాభివృద్ధి సాధ్యమని.. అధికారులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు సహకారం అందించాలని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందేలా సర్పంచులు, అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే ప్రజలకు బస్సు సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు సభ్యులు సంబంధిత శాఖ అధికారులను నిలదీశారు. సమావేశంలో గ్రామ పంచాయతీలో అభివద్ధి పనులు గృహనిర్మాణం, విద్యుత్తు, నీటిపారుదల, ఉపాధి హామీ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మొదలగు అంశాలపై సంబంధిత శాఖ అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో

తహశీల్దారు డి.లాజరస్, ఎంపీడీవో రజనీకాంత్, వైస్ ఎంపీపీలు తుపాకుల మీనాక్షి, ప్రసాద్ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు, వైద్య ఆరోగ్య , పశు వైద్య , నీటిపారుదల, ఇరిగేషన్, ఉపాధి హామీ, గృహనిర్మాణ, ఆయుర్వేద, ఆర్అండ్‌బీ , హార్టికల్చర్, స్త్రీ శిశుసంక్షేమ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

నేడు వర్చువల్ సేవా టికెట్ల దర్శన కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల: జనవరి 12 నుండి తిరుమలలో కళ్యాణోత్సవం, ఊంజల సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలకు సంబంధించిన ఆన్ లైన్ వర్చువల్ సేవా టికెట్లు సంబంధిత దర్శన కోటాను జనవరి 10వ తేదీ ఉదయం 9 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అయితే శ్రీవారి ఆలయంలో బాలాలయం దష్ట్యా ఫిబ్రవరి 22 నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్ లైన్ వర్చువల్ సేవ మరియు అనుబంధ దర్శన టికెట్ల కోట అందుబాటులో ఉండదు. భక్తులు ఈ విషయాన్ని గమనించి దర్శన టికెట్లను బుక్ చేసుకోవాలని టిటిడి కోరుతోంది.

చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి- కేవీబీపురం: రానున్న భోగి, మకర సంక్రాంతి పండుగ చాటున ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కేవీబీపురం ఎస్సై సునీల్ హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో

మాట్లాడుతూ పండుగల ముసుగులో జూదాలు, కోడి పందేలు, జల్లికట్టు వంటి చట్టవ్యతిరేక పనులకు దిగితే చర్యలు తప్పవన్నారు. విలాసాలకు, వ్యసనాల బారిన పడి కొందరు ఇలాంటి చట్టవ్యతిరేక పనులకు పాల్పడి వారి కుటుంబాలలో ప్రశాంత వాతావరణం దెబ్బ తీయడంతో పాటు శోకాన్ని నింపవద్దని ఆయన కోరారు. పండుగలను ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. సంక్రాంతి సెలవులకు ఎవరైనా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లినప్పుడు ముందుగానే పోలీస్ స్టేషనకు.. మహిళా పోలీసులకు సమాచారం ఇస్తే నిఘా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లోకనాథం, పోలీసు బందం, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎవరైనా కోడి పందేలు, పేకాట, జల్లికట్టు, అశ్లీల నత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్యవేడు ఎస్సై పురుషోత్తంరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

శెట్టిపల్లి లేఔట్ల సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: శెట్టిపల్లి లేఔట్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని సోమవారం శెట్టిపల్లి బాధితులు జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాధాకష్ణ మాట్లాడుతూ శెట్టిపల్లి లేఔట్లు పెండింగ్ పడిన నేపథ్యంలో బాధితులు చాలా గందరగోళంలో ఉన్నారన్నారు. పెండింగ్ పడ్డ లేఔట్స్ త్వరగా పరిష్కరించాలని కోరారు. అలాగే తుడాకి పంపించిన 19 లేఔట్ భూములను తుడా వారికి అప్పజెప్పాలని కోరారు. జేసీని కలిసిన వారిలో ఎ.రాధాకష్ణ, ఆవుల సురేష్, చెంజి హరికష్ణ, రమణ కంప్యూటర్, చిరంజీవి, విద్యాసాగర్, ఈశ్వర్, మహేష్, చౌడమని తదితరులు ఉన్నారు.

రైతు కూలీల ప్రాణాలు కాపాడిన రమాదేవి హాస్పిటల్ వైద్యులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని భవాని నగర్ లో గల శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బందం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైన కడప జిల్లాకు చెందిన గురునాథం, సూర్య, రమేష్ ప్రాణాలను అత్యాధునిక వైద్య పద్ధతుల ద్వారా శస్త్ర చికిత్సలు చేసి వారి ప్రాణాలను కాపాడారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బి.శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల రెండవ తేదీన తీవ్ర రక్త గాయాలతో తమ హాస్పిటల్ కు వచ్చారని, వైద్య పరీక్షల అనంతరం వారికి తలలో రక్తం గడ్డ కట్టినట్టుగా గుర్తించామన్నారు. వెంటనే అప్రమత్తమై ఆరోగ్యశ్రీ ద్వారా తమ నిపుణుల వైద్య బందంచే క్రేనియా శస్త్ర చికిత్స చేసి వారి తలలో గడ్డ కట్టిన రక్తాన్ని విజయవంతంగా తొలగించామన్నారు. ఈ

సందర్భంగా సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ బి. రాధాకష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రమాద బాధితులు ఎప్పుడైనా తమ హాస్పిటల్ కు రావచ్చునన్నారు. తమ హాస్పిటల్ లో ఉండే నిపుణుల వైద్య బందం రోగులకు సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటుందన్నారు.

పేద విద్యార్థిని చదువుకు ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నిరుపేద విద్యార్థిని చదువుకు స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆర్థిక సాయం చేశారు. పట్టణంలోని 35వ వార్డు ఏఎం పుత్తూరుకు చెందిన సాయి లీలా నెల్లూరు పద్మావతి నర్సింగ్ కాలేజ్ లో చివరి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ఫీజు కట్టడానికి వారి ఆర్థిక స్థోమత సరిపోకపోవడంతో ఎమ్మెల్యేను ఆశ్రయించారు. ఎమ్మెల్యే వెంటనే కాలేజీ యాజమాన్యంతో మాట్లాడి రాయితీతో కూడిన కాలేజీ

ఫీజుకు సోమవారం రూ.40 వేలు సాయం చేశారు.

వీసీ, రిజిస్ట్రార్‌లకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య దువ్వూరు జమున వర్సిటీ అభివృద్ధిలో ఆమె కృషి అమోఘమైనదని, అమూల్యమైనదని ఉపాధ్యాయ సంఘం నేతలు కొనియాడారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సావేరి అతిథి గహంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. జమున, ఫార్మర్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.ఎం.మమతకు ఘనంగా వీడ్కోలు సభ జరిగింది. టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సారా సరోజినీ మాట్లాడుతూ ఆచార్య దువ్వూరు జమున, మమత ఇద్దరు చాలా కష్టజీవులని, వారి ఆధ్వర్యంలో యూనివర్సిటీకి ఎన్నో ప్రాజెక్ట్ వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని, దుర్గాభవాని, త్రిపుర సుందరి, మాధవి, శిరీష, బిందు, విజయలక్ష్మి, దుర్గాభవాని, శోభారాణి, శ్రీరజిని శిరీష పాల్గొన్నారు.

ఆచార్య రాజారెడ్డి ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ప్రస్తుతం ఉన్న ఆచార్య దువ్వూరు జమున పదవీకాలం ఈనెల 7వ తేదీతో ముగిసింది. దీంతో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పదవులు ఖాళీగా ఉండటంతో ఇన్‌ఛార్జిలను నియమించింది. ఇందులో భాగంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్యకే రాజారెడ్డి ని ఇంచార్జ్ ఉపకులపతిగా నియామక ఉత్తర్వులు ఇచ్చింది. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆచార్య దువ్వూరు జమున ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల కాలంలో బోధన, పరిశోధన రంగాల్లో విస్తతంగా అభివద్ధిని సాధించి జాతీయస్థాయి 'నాక్' కమిటీచే ఏ ప్లస్ గ్రేడ్ ను సాధించింది. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విజయవంతమైన ఉపకులపతిగా ఆచార్య జమున పేరు గడించారు. నేటితో ఆమె పదవి కాలం ముగియడంతో మహిళా వర్సిటీ ఇంచార్జ్ ఉపకులపతిగా ఆచార్య రాజారెడ్డి ప్రొఫెసర్ దువ్వూరు జమున నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పిలుపే ప్రభంజనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రామికుడి చెమటలోంచి, కార్మికుడి కరిగిన కండలోంచి, రైతు కూలీల రక్తంలోంచి నిరుపేదల కన్నీటి లోంచి, కష్టజీవుల కంటి మంటల్లోంచి, అన్నార్తుల ఆక్రందనల్లోంచి పుట్టిందీ తెలుగుదేశం పార్టీ అని ప్రకటించి ఎన్టీఆర్ ఓ ప్రభంజనం సష్టించారని ఎన్టీర్ అభిమాన సంఘ నాయకులు షేక్ జిలానీ, డా.యం.ఉమేష్ రావు సోమవారం పేర్కొన్నారు. టీడీపీ అధికారం చేపట్టి నేటికి నలభై సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం నందమూరి అభిమానులు, టీడీపీ నాయకులు స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులు అర్పించారు. జి.దశరథాచారి, రెడ్డివారి గురవా రెడ్డి, మిన్నల్ రవి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ హాస్పిటల్‌తో మహిళా వర్సిటీ అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి- క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ మరియు రీసెర్చ్ సంస్థతో అవగాహన ఒప్పందాన్ని సోమవారం చేసుకున్నారు వర్సిటీ ఉప కులపతి ఆచార్య దువ్వూరు జమున రిజిస్టర్ ఆచార్య ఎన్ రజిని ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ సంస్థ అధికారులతో పరస్పరం అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య దువ్వూరు జమున మాట్లాడుతూ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నర్సింగ్ చదివే విద్యార్థులలో శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ మరియు రీసెర్చ్ సంస్థలో ఇంటర్నెట్ షిప్, నర్సింగ్ విద్యార్థులకు ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమాల కోసం, ఇతర బోధన ,పరిశోధన అంశాలలో పరస్పర సహకారం ఈ అవగాహన ఒప్పందం లో కుదుర్చుకోవడం జరిగిందన్నారు.

జనరల్ న్యూస్

పేకాట స్థావరాలపై ఉక్కు పాదం

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని రోసునూరు గ్రామం నందు సోమవారం పెళ్లకూరు మండల ఎస్సై పేకాట స్థావరంపై తన సిబ్బందితో ఆకస్మిక దాడి చేశారు. 4,540 రూపాయల నగదు తోపాటు,నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మండలంలో ఏ ప్రాంతంలోనైనా జూదాలు, కోడి పందాలు ,పేకాట మొదలైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పేకాట నిర్వాహకులు సుమారు రహదారుల వద్ద, రెండు మూడు కిలోమీటర్ల దూరం నుండి సమాచారం అందించుటకు వ్యక్తులను ఏర్పాటు చేసి ఆడుతున్నప్పటికీ ,అత్యంత చాకచక్యంతో దాడులను నిర్వహించినందుకు స్థానికులు ఎస్సైను కొనియాడారు.

'రియల్ మీ 10' ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: భారత దేశంలో అతి వేగంగా ఎదిగే స్మార్ట్ ఫోన్ బ్రాండ్ రియల్ మీ కొత్త స్మార్ట్ ఫోన్ రియల్ సిరీస్లో రియల్ మీ 10 ప్రవేశ పెట్టినట్లు రియల్ మీ ఇండియా సీఈవో, వైస్ ప్రెసిడెంట్ మాధవ్ సేథ్ తెలిపారు. ఆధునీకరించిన టెక్నాలజీతో ఎన్నడూ చూడని ఫీచర్స్, పనితీరులో దీనికి ఏదీ సాటి రాదన్నారు. రియల్ మీ ఎక్కడా వెనక్కి తగ్గని ఫీచర్స్ తో ఈ కొత్త సంవత్సరం లో స్మార్ట్ఫోన్ వినియోగదారులకు మెరుగైన ఇంటరేక్షన్స్ ని అందిస్తుందన్నారు. నిబద్ధతతో యువతకు మెరుగైన టెక్నాలజీ సరసమైన ధరలకు అందిస్తుందన్నారు. ఈ విభాగంలో స్లిమ్ డిజైన్ అయిన రియల్ మీ 10 డిజైన్ ని పరిచయం చేశామన్నారు. ఇది శక్తివంతమైన మీడియా టెక్ హెలియో జీ99 ప్రోసెసర్ ని అందిస్తుందన్నారు. కొత్త విజన్ తో మెరుగైన పనితీరు అనేవి రియల్ మీ 10 వినియోగదారులకి అందిస్తుందన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు గెడిపూడి విజయ్ కుమార్ నాయుడు అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 33వ వార్డులో టీడీపీ నాయకులు పర్యటించారు. నిత్యావసర వస్తువులు, కరెంట్ బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు ఎలా పెరిగాయో ప్రజలకు విజయకుమార్ వివరించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని విధాలుగా నష్టపోయామంటూ ప్రజలు టిడిపి నాయకులు ఎదుట వాపోయారు. టీడీపీ కి ఓట్లేస్తే అభివద్ధికి ఓట్లు వేసినట్లేనని ఆయన పిలుపునిచ్చారు. అప్పులాంధ్రాగా మార్చిన జగన్ ప్రభుత్వానికి చారామగీతం పాడాలని పిలుపునిచ్చారు. పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఇంటింటికీ అప్పుల భారం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : విజయపురం మండలం జగన్నాథపురం, క్షురికాపురం పంచాయతీలలో సోమవారం ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో ప్రతి గడపలో పెరిగిన కరెంటు ఛార్జీలు, పన్నులు, పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యావసర ధరలు, మరో వైపు గడపగడపలో లక్షల రూపాయల అప్పుల భారం మోపారని నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భానుప్రకాష్ తెలిపారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల్లో ఓటమి భయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : జనసేన అధినేత శ్రీ పవన్ కల్యాణ్ కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి వైసీపీ నేతలు ఓటమి భయం పట్టుకుందనీ, ఆయనపై అనుచిత వాక్యాలు చేస్తే సహించేది లేదని జనసేన పార్టీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి, అంజూరు చక్రధర్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. విశాఖలో పవన్ కల్యాణ్ పై జగన్ ప్రభుత్వం తన ఉగ్రవాదాన్ని ప్రదర్శించినపుడు పవన్ ను చంద్రబాబు నాయుడు కలిసి సంఘీభావం ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడి కుప్పం పర్యటనలో అడుగడుగునా అవాంతరాలు సష్టిస్తే, బాబును కలిసి పవన్ సంఘీభావం తెలిపారన్నారు. అయితే పవన్, బాబు కలయికలపై వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు అవాకులు చవాకులు పేలడం చూస్తుంటే వాళ్లకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులు అర్పించారు. టీడీపీ ఆవిర్భవించిన తీరును గుర్తు చేసుకున్నారు. జి.దశరథాచారి, రెడ్డివారి గురవా రెడ్డి, మిన్నల్ రవి తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT CHITTOOR
A.C.P. No. 126 of 2022
Vajrankura Chit Funds Pvt., Ltd.,
Tirupathi Branch, Rep.by its Foreman ... Disputant.
Versus
1. **Raju Anandudu**
2. **Elupuru Sreenivasulu**
3. **Goduguchinta Bhaskar Thulasiram**
4. **Kanakurthy Venkata Mukunda Babu** ... Opponents

Notice

To,
Opp-4. **Kanakurthy Venkata Mukunda Babu,** S/o **K. Venkata Munu Swamy,** Occ: Record Asst. Z.P.H. School, Sri Rangampalli, Gudipala Manal, Chittoor Dist. R/o D.No. 15-824, B.P. Agraharam-517644, Sri Kalahasthi Mandal, Chittoor Dist.

పై నెంబరున డిస్ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, చిత్తూరు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నా రు. సదరు కేసు లో మీకు నోటీసునిమిత్తం **తే17-01-2023** దికి వాయిదా వేసియున్నారు.కావున వాయిదా రోజు **ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయంగాగానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన డిప్యూటీ రిజి స్ట్రార్ ఆఫ్‌చిట్స్, చిత్తూరు వారి ఆఫీసులో హాజరై ఆక్షేపణలు తెలుపు కోవలసినది.లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

కె.సురేష్, బి.ఎ., బి.ఎల్.,
డిస్ప్యూటెంట్ తరపు అడ్వకేట్, చిత్తూరు.